క్లుప్తంగా

కొనసాగుతున్న ఓటరు లిస్టు సవరణ



హిమాయత్‌నగర్‌లో ఓటరు లిస్టు మార్జిన్ పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటర్ లిస్ట్ మార్జిన్(ఇంటి నంబర్ ఆధారంగా అందరి ఓట్లను వరుసలో చేయడం) కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సంధ్యారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, పంచాయతీ కారోబార్ యాదయ్య, శ్రీనుగౌడ్ తదితరులు ఓటరు లిస్టు సవరణలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు ఓటరు లిస్టు మార్జిన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డుల వారీగా ఓటరు లిస్టులో పేర్లు, ఇంటి నంబర్‌ను బట్టి ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు వారిని సీరియల్‌గా చేస్తున్నామని తెలిపారు.

రక్షణ కంచెను తొలగించాలి



నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: ప్రభుత్వ భూమిలో అక్రమంగా రక్షణ కంచెను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపిస్తూ మండల నాయబ్ తహసీల్దార్ గీతకు గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందించారు. కేశంపేట గ్రామంలోని సర్వే నంబర్ 70లో ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిలో గ్రామానికి చెందిన కొందరు రక్షణ కంచెను ఏర్పాటు చేస్తున్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న రక్షణ కంచెను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, వెంకటమ్మ, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, యుగేందర్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 17వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. సీసీ, బీటీలతో పాటు యూజీడీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ సాయిరాం, నాయకులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ కృష్ణారెడ్డి, బాల్‌నింగని జంగయ్య, టేకుల శశిధర్‌రెడ్డి, వంగేటి కొండల్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, రాఘవరెడ్డి, సుధాకర్, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హైడ్రాకు హ్యాట్సాఫ్

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్: నగరంలోని చెరువులు, నాలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై ప్రభుత్వం హైడ్రా ద్వారా ఉక్కుపాదం మోపడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిజాయితీ గల అధికారి ఆధ్వర్యంలో హైడ్రా చెరువుల్లోని ఆక్రమణలను తొలగిస్తూ తన బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో అవినీతికి పాల్పడ్డ మాజీ మంత్రులు అవాక్కులు, చెవాక్కులు పేల్చుతున్నారన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాతనే చర్యలు తీసుకుంటున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిబద్ధతకు నిదర్శనమన్నారు. హైడ్రా ద్వారా మంచి పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.



అజీజ్‌నగర్‌లో ఆయా, టీచర్ లేక మూతబడ్డ అంగన్‌వాడీ కేంద్రం



ఎత్‌మార్‌పల్లిలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

అందని అంగన్‌వాడీ సేవలు

టీచర్లు, ఆయాలు లేకపోవడంతో మూతబడ్డ కేంద్రాలు

- చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సేవలు దూరం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మొయినాబాద్‌రూరల్: చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడానికి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తల్లిదండ్రుల తర్వాత అలనా పాలన చూస్తూ వారికి విద్యాబుద్ధులు నేర్పించే ఆ అంగన్‌వాడీ కేంద్రాలు మండలంలో మూడు మూతపడి ఉన్నాయి. ఆయా ప్రభుత్వాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు బాలామృతంతో పాటు గుడ్లు సరఫరా చేస్తారు. ఇవే కాకుండా పిల్లలను పాఠశాలలో చేర్పించుకొని వారికి ఆటపాటలతో పాటు కావాల్సిన ధ్రువపత్రాలు అందజేస్తారు. కేంద్రాలు మూతపడి ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలకు సేవలు దూరమవుతున్నాయి.

మూడు కేంద్రాలు మూత

మొయినాబాద్ మండలంలో మొత్తం 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ మండలంలో రెండు సెక్టార్లుగా విభజించి ఇద్దరు సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు. మండల పరిధిలోని రెండు సెక్టార్‌లలో ఒకటి హిమాయత్‌నగర్, మొయినాబాద్. హిమాయత్‌నగర్ సెక్టార్‌లో 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా మొయినాబాద్ సెక్టార్‌లో 58 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మొయినాబాద్ సెక్టార్ పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ దాదాపు రెండు సంవత్సరాల నుంచి ఆయా, అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో కొంతకాలంగా గ్రామ సర్పంచ్ సొంత డబ్బులతో నడిపించారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో అంగన్‌వాడీ సెంటర్ మూతపడిపోయింది. అదేవిధంగా శ్రీరామ్‌నగర్‌లో టీచర్, ఆయా లేకపోవడంతో జూన్ నెలలో మూతపడింది. హిమాయత్‌నగర్ సెక్టార్ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో ఒకటి అజీజ్‌నగర్ గ్రామంలో, రెండోది ఎస్సీ కాలనీలో ఉంది. 1వ కేంద్రం అంగన్‌వాడీ టీచర్ జూలై నెలలో ఆమె పదవికి రాజీనామా చేసింది. అక్కడ ఆయా కూడా లేదు. దీంతో అజీజ్‌నగర్ 1వ అంగన్‌వాడీ కేంద్రం రెండు నెలల నుంచి తాళం వేసి ఉంది. ఈ గ్రామాల్లో ప్రభుత్వాల ద్వారా వచ్చే బాలామృతం, పోషకాహారాన్ని ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు నెలకొకసారి పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఇన్‌చార్జిలుగా వచ్చి అందిస్తున్నారు. కానీ ఈ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడం వారికి విద్యాబుద్ధులు, ఆటాపాటలు నేర్పించడం లేదు. మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు చొరవ తీసుకొని పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



సొంత డబ్బులతో నడిపించాం

మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామంలో కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పడిన తర్వాత సర్పంచ్‌గా ప్రజలు నన్ను గెలిపించారు. గత రెండు సంవత్సరాల నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా, టీచర్ ఖాళీ కావడంతో సొంత డబ్బులతో రెండు సంవత్సరాలుగా కొనసాగించాను. సర్పంచ్ పదవీ పూర్తి కావడంతో అప్పటి నుంచి ఈ అంగన్‌వాడీ కేంద్రం మూతపడిన మాట నిజమే. ప్రభుత్వం ద్వారా అంగన్‌వాడీ టీచర్, ఆయాను నియమించాలని ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు తెలియజేసిన లాభం లేకపోయింది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అయిన ఎత్‌మార్‌పల్లిలో ఒకే ఒక్క అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఈ కేంద్రం ప్రజలకు ఉపయోగపడేలా చూడాలి.

– గుండాల నవనీతరాజు, మాజీ సర్పంచ్, ఎత్‌మార్‌పల్లి

అధికారులకు తెలియజేశాం

మొయినాబాద్ మండలంలో 59 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న మాట నిజమే. అందులో మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేక మూతపడి ఉన్నాయి. ప్రతి నెల ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న పక్క అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు బాలామృతం, గుడ్లు సరఫరా చేస్తారు. టీచర్, ఆయాలు లేని విషయాన్ని పైఅధికారులకు తెలియజేశాం.

– యక్సూబా, సీడీపీఓ, చేవెళ్ల

చివరికి న్యాయమే గెలిచింది

మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్

షాద్‌నగర్: ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయమే గెలిచిందని మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్ అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సుప్రీం కోర్టు ఎమ్మెల్సీ కల్వకుంట కవితకు మంగళవారం బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో షాద్‌నగర్ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చౌరస్తాలో టపాసులు కాల్చి, సీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నటరాజన్ మాట్లాడుతూ.. కక్షపూరితంగానే ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను బీజేపీ నేతలు ఇరికించి అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. 166 రోజుల పాటు కవిత తీహార్‌లో జైలు జీవితాన్ని గడిపిందన్నారు. ఈ కేసులో దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐలు కవితను అనేక ఇబ్బందులకు గురి చేశాయన్నారు. ఇప్పటివరకు దర్యాప్తు సంస్థలు ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయాయన్నారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఆమెకు బెయిల్ మంజూరు చేసిందని, చివరికి న్యాయమే గెలిచిందన్నారు. రాబోవు రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, రాజ్యలక్ష్మి, గుడ్డు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ చౌరస్తాలో సంబురాలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

విద్యాసంస్థల అవినీతిపై విచారణ జరిపించాలి



స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

చేవెళ్ల: శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నాయని పీడీఎస్‌యూ చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు పి.ప్రభాస్, కార్యదర్శి బి.శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఎదుట మంగళవారం పీడీఎస్‌యూ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీచైతన్య కార్పొరేట్ విద్యాసంస్థల ఎదుట ఆందోళనకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని చెప్పారు. ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో పీడీఎస్‌యూ నాయకులపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, మహేందర్, మురళి, అశోక్, బురాన్ అలీ, అజయ్, బబ్లూ, రాఘురామ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మైత్రితోనే కవితకు బెయిల్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: బీజేపీ మద్దతుతోనే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ మంగళవారం ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని, దీనికి నిదర్శనమే కవితకు బెయిల్ రావడం అన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వడంతోనే 8 ఎంపీ స్థానాల్లో కాషాయ పార్టీ గెలుపొందిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని రాష్ట్రాల ప్రభుత్వాధినేతల అవినీతిపై విచారణ జరుగుతుందని కేఎల్లార్ స్పష్టం చేశారు.

ఆర్థికసాయం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన దార ఆగమయ్య ఇళ్లు మూడు నెలల క్రితం విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం కింద ఆగమయ్యకు మంజూరైన రూ.95వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి కుటుంబానికి తమ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారంగా మధ్యాహ్న భోజన నిర్వహణ

నిధులు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్

చేవెళ్ల: మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వాలు ఏటా నిధులు తగ్గిస్తుండడంతో నిర్వహణ భారంగా మారుతోందని, ఈ పథకానికి నిధులు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వటం మానేయాలన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం ఏటా నిధులు తగ్గిస్తుండడంతో నిర్వహణ భారంగా మారుతోందన్నారు. దీంతో కార్మికులు అప్పుల పాలు అవుతున్నారన్నారు. బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇతర రాష్ట్రాలు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళలలో ఇస్తున్నట్లుగానే వేతనాలు చెల్లించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ మెంబర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సహాయ కార్యదర్శి బి.అరుణ్‌కుమార్, సభ్యులు స్టాలిన్, వంశీ, అరుణ్, శ్రీనివాస్, సంధ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ప్రణయ్

భూమి కేటాయించాలని వినతి

కొత్తూరు: తమ గ్రామ అవసరాల నిమిత్తం గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కొంత కేటాయించాలని మండలంలోని సిద్దాపూర్ గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత శేఖర్‌రెడ్డితో పాటు పలువురు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామంలో టీజీఐఐసీ సేకరించిన పొలాల్లో నుంచి 20 ఎకరాలు గ్రామ అవసరాల కోసం ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా భూసేకరణలో పరిహారం అందని 26 మంది రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించినట్లు తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావుతో చర్చించి గ్రామస్తులు కోరిన విధంగా గ్రామ అవసరాల కోసం సర్వే నంబర్ 278లో భూమిని పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా భూసేకరణలో పరిహారం అందని రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆర్డీఓ కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డితో కలిసి గ్రామంలో ప్రభుత్వ పొలాన్ని పరిశీలించి టీజీఐఐసీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. భూ సేకరణలో పరిహారం అందని రైతులకు ప్రభుత్వం తరఫున తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, ఖాజా, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, తహసీల్దార్

పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 16, 18, 2 వార్డులోని కాలనీ వాసులతో ఎమ్మెల్యే ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణాభివృద్ధికి ప్రజలు తమవంతు సహకారం అందించాలని సూచించారు. డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన వారికి పార్టీలకతీతంగా కేటాయిస్తామన్నా రు. సమావేశంలో కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూరు బస్వం, బచ్చలి నరేశ్, బాబర్‌ఖాన్, వన్నాడ ప్రకాశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, సూర్యప్రకాశ్, ఖాదీర్, రమేశ్, నాగయ్య, చందు, రామారావు, శంకర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పట్టణంలోని 15వ వార్డు ఖాజీపుర కాలనీకి చెందిన అన్వర్ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చెన్నయ్య, బుడ్డ నర్సింహ, వెంకటేశ్, జాఫర్, షకీర్, సలీం, బాబు, లక్ష్మణ్, కృష్ణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం

కొత్తూరు: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుణమాఫీపై ఆయా పార్టీల నాయకులు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. ఇప్పటికే షాద్‌నగర్ నియోజకవర్గంలో 93 శాతం మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. ఇప్పటికే వ్యవసాయ అధికారులు రుణమాఫీకి అర్హులుగా ఉండి రుణమాఫీ జరగని వారి వివరాలను సేకరిస్తున్నారని వివరించారు. అంతేకాకుండా రైతుల సమక్షంలోనే మరోమారు అధికారులే రుణమాఫీ కోసం దరఖాస్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ రాజారత్నం, మండల వ్యవసాయ అధికారి గోపాల్, ఏఈఓలు దీపిక, నిఖిత, నాయకులు సుదర్శన్‌గౌడ్, సురేందర్, హరినాథ్ రెడ్డి, బాల్‌శౌరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, ఏసీపీ కిషన్



మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిరాం పక్కనే పోలీస్, రెవెన్యూ అధికారులు

చేవెళ్ల: గణేశ్ ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, ఏసీపీ కిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అట్లాస్ మినీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేవెళ్ల డివిజన్ స్థాయి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌లో కులమతాలకతీతంగా గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహించుకోవాలని తెలిపారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో గాని నేరుగా గాని పోలీస్‌శాఖ వారికి సమాచారం అందించాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల వద్ద కూడా అనుమతి తీసుకొని విద్యుత్ కనెక్షన్‌లు పొందాలని తెలిపారు. సమస్యలు, గొడవలకు దారితీసే ప్రదేశాల్లో మండపాలను ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రతీ మండపం వద్ద కమిటీ సభ్యులు నిర్వహణ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. మండపాలను రోడ్లకు అడ్డుగా వేసుకోవద్దని చెప్పారు. నిమజ్జనం ఎప్పుడు చేస్తారో ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. చేవెళ్ల గుండం వద్ద ఈ ఏడాది నీళ్లు ఎక్కువగా ఉండటంతో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. ప్రజలు మట్టి విగ్రహాల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతీ మండపం వద్ద సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు భూపాల్‌శ్రీధర్, వీరబాబు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓలు విఠలేశ్వర్‌జీ, గిరిరాజు, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, వినాయక మండపాల నిర్వాహకులు, మండలంలోని పలు పార్టీల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కారం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

మొయినాబాద్‌రూరల్: కార్మికులందరూ ఐకమత్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఆటో కార్మికులు అల్లి దేవేందర్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు సీఐటీయూ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆటో కార్మికులకు ప్రకటించిన డబ్బులను వెంటనే అందించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి కుటుంబ పోషణ భారంగా మారిందని ఇందుకు ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకునేందుకు కృషి చేయాలన్నారు. ఆటో కార్మికులు యేసు, చెన్నయ్య, బాబు, విక్రమ్, రవి, రాజేందర్, మహేందర్, కృష్ణ, రవీందర్, సాయి, ఉస్మాన్, కృష్ణ, మోబీన్ ఇస్మాయిల్, మహబూబ్, నర్సింహ, జగ్గు, వినోద్, పెంటయ్య, శ్రీరాములు, మోహిన్ హుస్సేన్, వెంకటేశ్, రవి, సునీల్ సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ముంజగళ్ల ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూలో అల్లి దేవేందర్ సమక్షంలో చేరుతున్న అజీజ్‌నగర్ ఆటో కార్మికులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, డాక్టర్ అఖిల్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా శిబిరంలో 216 మంది రోగులకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, వైరల్ ఫీవర్, తదితర రోగాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ అఖిల్ మాట్లాడుతూ.. వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతునొప్పి, కళ్ల మంటలు, ముక్కు కారడం, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దన్నారు. తక్షణమే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పెంటమ్మ, భగ్‌వాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రయ్య, అశోక్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, శ్రీను, మల్లయ్య, సత్యనారాయణ, శ్రీనివాసురెడ్డి, కిరణ్, రామ్‌రెడ్డి, జంగయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న వెంకటేశ్, వైద్యులు